క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 12వ వార్డు మల్లమ్మగుడి సచివాలయం పరిధిలో ఉన్న మనులాలపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజక వర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొనాలని నేదురుమల్లి కార్యాలయ సిబ్బంది తెలిపారు.

నేడు అయ్యప్ప స్వామి 22వ జ్యోతి పూజోత్సవం

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో సోమవారం అయ్యప్పస్వామి 22వ జ్యోతి పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. కలశ పూజ, 18 రకాల అభిషేక ద్రవ్యాలతో నగర సంకీర్తన, 108 కలశాలలోని ద్రవ్యాలతో కన్నెస్వాములతో అభిషేకం ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం 18 రకాల ప్రసాదాలతో స్వామి వారికి మహా నైవేద్యం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపడతామని తెలిపారు. సాయంత్రం అఖండ జ్యోతులతో స్వామి వారికి గ్రామోత్సవం, పడి పూజ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు పెన్షనర్స్ వార్షికోత్సవం

కోట: ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ వాకాడు తాలూకా యూనిట్ 19వ వార్షికోత్సవాన్ని కోట షాదీమంజిల్‌లో సోమవారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కోట వెంకటాచలం తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్లను సన్మానిస్తామని, పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తామన్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని పెన్షనర్లు హాజరుకావాలని కోరారు.

మల్లాంలో కుజదోష నివారణ పూజలు



విశేషాలంకరణలో స్వామి వారు

చిట్టమూరు : మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కుజదోష నివారణ పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం అర్చకుడు మూలంరాజు భానుప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో కుజదోషం ఉన్న వారితో హోమాలు చేయించారు. మధ్యాహ్నం భక్తుల కు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆల య ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

హిటాచీ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న హిటాచీ

సైదాపురం: తలుపూరు అటవీ ప్రాంతంలో అక్రమంగా తెల్లరాయిని తవ్వుతున్న హిటాచీ వాహనాన్ని ఆదివారం స్వాధీనం చేసుకున్నట్టు నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. గుట్టుచప్పుడు కాకుండా తెల్లరాయిని తవ్వుతున్న హిటాచీని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సిబ్బంది అమీనయ్య, రవిశేఖర్, విజయ్‌కుమార్, గిరిజాకుమారి, శివ పాల్గొన్నారు.

కోట ఎస్‌ఐగా నాగబాబు



కోట:కోట ఎస్‌ఐగా నాగబాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తానని, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వచ్చి తెలియజేయవచ్చని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం



దెబ్బతిన్న రోడ్డు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రం నుంచి వెదురుపట్టు గ్రామానికి వెళ్లే రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురైంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైఎస్సార్ బీమా చెక్కుల పంపిణీ

రాపూరు: మండలంలోని పంగిలిలో ప్రమాదవశాత్తు మృతిచెందిన ఇద్దరి కుటుంబ సభ్యులకు ఆదివారం సర్పంచ్ లక్ష్మీదేవమ్మ వైఎస్సార్ బీమా చెక్కులు అందజేశారు. ఇటీవల రమణయ్య, రామయ్య మృతిచెందారు. ఈ క్రమంలో వారికి వైఎస్సార్ బీమా నుంచి మంజూరైన రూ.10 వేలను రమణయ్య భార్య రేణుకమ్మ, రామయ్య భార్య వెంకటరమణమ్మకు అందజేశారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండ



దొరవారిసత్రం : కమ్మకంద్రిగలో ఎస్టీలకు నగదు అందజేస్తున్న అధికారులు



చిల్లకూరు : పొన్నవోలులో నగదు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

దొరవారిసత్రం : వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. వారు ఆదివారం వేటగిరిపాళెం గ్రామంలోని 95 వరద బాధిత కుటుంబాలు, కమ్మకంద్రిగ గ్రామం ఎస్టీ కాలనీలోని 26 వరద బాధితుల కుటుంబాలకు నగదు, నిత్యావసర వస్తువులు అందజేశారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, వీఆర్వో మురళి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం పంపిణీ

చిల్లకూరు : మండలంలోని వరద బాధితులకు అధికారులు పరిహారాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ రెవెన్యూ సిబ్బంది చింతవరం సచివాలయం పరిధిలోని పొన్నవోలు పంచాయతీలో బాధితులకు బియ్యం, నూనె, నిత్యావసర సరుకులు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి వారి వివరాలు తెలుసుకుని 176 కుటుంబాలకు నగదు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో నరసింహులు, వీఆర్ఏ ప్రతాప్ పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ



ఫల సరుకులు అందజేస్తున్న డాక్టర్ రోహిణి తదితరులు

గూడూరు రూరల్ : పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీఆర్‌రెడ్డి ఆసరా కార్యక్రమం కింద పేదలకు ఫల సరుకులు పంపిణీ చేశారు. ఇందులో ముఖ్యఅతిథిగా డాక్టర్ రోహిణి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన మహోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు రూరల్ : గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. గూడూరు పట్టణ శివారులోని చల్లకాలువ సమీపంలో వెలసిన తాళమ్మ ఆలయంలో ఆదివారం గౌడ్ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం తాళమ్మను దర్శించుకున్నారు. ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆయనను గౌడ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాసిన నాగులు, గౌడ సంఘం నాయకు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

గూడూరు పట్టణానికి చెందిన జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ కుమార్తె వివాహం ఆదివారం పీవీఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక నిఘా



స్వాధీనం చేసుకున్న స్వాధీనం చేసుకున్న లారీ

సైదాపురం: మండలం నుంచి అక్రమంగా ఖనిజ సంపదను తవ్వి తరలించేవారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం సైదాపురం మండలంలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఖనిజాన్ని తవ్వి తరలిస్తున్న రెండు లారీలు, టిప్పరు, జేసీబీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఆయన వెంట విజిలెన్స్ ఏడీ బాలాజీనాయక్ ఉన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు చీరలు అందజేస్తున్న దాతలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం చెన్నైకి చెందిన ఎఫ్‌పీఈఎం సంస్థ నిర్వాహకులు ఎఫ్.శామ్యూల్, ఎం.ఫ్రాంక్లిన్, ఆర్ఎస్ పాండ్యరాజ్ దుస్తులు పంపిణీ చేశారు. ఆశ్రమ నిర్వాహకుల సేవలను కొనియాడారు. ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్నీ పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ



దుప్పట్లు, వంట సామగ్రి అందజేస్తున్న జయకుమార్

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లి సమీపంలో ఉన్న కుష్టువ్యాధిగ్రస్తులకు ఆదివారం స్థానిక కేతొలిస్ మిషన్ చర్చి నిర్వాహకులు జయకుమార్, సెలిన్ దుప్పట్లు, వంట సామగ్రి అందజేశారు. వారు మాట్లాడుతూ క్రిస్మస్‌ను పురస్కరించుకుని కుష్టువ్యాధిగ్రస్తుల కుటుంబాలకు దుప్పటు, బట్టలు, వంటసామగ్రి అందజేసినట్టు తెలిపారు. వారికి అన్నదానం చేశామన్నారు.

అట్టహాసంగా హిందూ సమ్మేళనం



రాపూరులో ర్యాలీ చేస్తున్న సమరత సేవా ఫౌండేషన్ నిర్వాహకులు

రాపూరు: హిందూ ధర్మప్రచారంలో భాగంగా ఆదివారం సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమేళనం కార్యక్రమాన్ని రాపూరు సమీపంలోని కృష్ణమందిరంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక శివాలయం నుంచి మద్దెలమడుగు కృష్ణమందిరం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హిందూ ధర్మంపై సమాజంలో జరుగుతున్న దాడులను వివరించారు. ఈ క్రమంలో ప్రజల్లో హిందూ ధర్మంపై చైతన్యం కలిగించేందుకు సమ్మేళనం చేపట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమరత సేవా సంస్థ నిర్వాహకులు ఈశ్వరయ్య, రాంబాబా, మనోహర్‌రెడ్డి, భాస్కర్, ఆనంద్, రాఘవరెడ్డి, కుసుమ పాల్గొన్నారు.

ముంపులోనే పొలాలు



చింతవరం వద్ద నీటిలోనే ఉన్న పొలాలు

చిల్లకూరు : భారీ వర్షాలు నిలిచిపోయి పది రోజులు అవుతున్నా తీర ప్రాంతంలోని చింతవరం సమీపంలో బల్లవోలు కాలువలో నీరు దిగువకు వెళ్లలేదు. దీంతో రామారెడ్డిపాళెం, వేళ్లపాళెం, కొరావారిపాళెంకు చెందిన రైతుల పొలాలు నీటిలో ఉండిపోయాయి. నీరు ఇంకేలోపు అదును దాటి సాగుకు అవకాశం లేకుండా పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న సిలికా గనుల్లో పడిన వర్షంతో పాటు ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు వేళ్లపాళెం నుంచి బల్లవోలు డ్రైన్ కాలువలోకి చేరి అక్కడి నుంచి కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలో కలుస్తుంది. బల్లవోలు డ్రైన్ కాలువ దగ్గర గేట్లు తక్కువ ఎత్తులో ఉండడంతో దిగువకు నీరు వెళ్లడం లేదు. ఈ కారణంగా నాలుగు గ్రామాలకు చెందిన 250 ఎకరాల వరకు పొలాలు నీటిలో ఉన్నాయి. నీటి పారుదల శాఖ అధికారులు చొరవ తీసుకుని బల్లవోలు డ్రైన్ కాలువ వద్ద ఉన్న గేట్ల ఎత్తు పెంచేలా చర్యలు తీసుకుని నీరు వెళ్లేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జానకిరామయ్య

వెంకటగిరి రూరల్ : చేనేత పరిశ్రమను అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాడా జానకిరామయ్య తెలిపారు. ఆయనను ఆదివారం తన స్వగృహంలో పలువురు చేనేత కార్మికులు కలిశారు. వారి సమస్యలను వివరించారు. మాడా జానకిరామయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సహకారంతో చేనేత కార్మికుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. చేనేతలకు అన్ని విధాలా అండగా ఉంటానని తెలిపారు.


ప్రత్యేక ప్రార్థనలు



పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న సంఘ కాపరి తదితరులు

చిల్లకూరు : ముందస్తు క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ఆదివారం ఏరూరు గ్రామంలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో సంఘ కాపరి విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు ప్రత్యేక గీతాలను ఆలపించి నృత్యం చేశారు. అనంతరం గ్రామంలోని గిరిజన కాలనీలోని 100 కుటుంబాల వారికి ఆహార ప్యాకెట్లు అందజేశారు. సంఘ కాపరి విజయకుమార్ మాట్లాడుతూ పొరుగు వారిని ప్రేమించాలని ఏసుక్రీస్తు చెప్పారని, పేదల ఆకలి తీర్చేందుకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. చర్చి పెద్ద మంచాల లలితమ్మ పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు



విశేష అలంకారంలో సీతారాములు

వాకాడు : మండలం బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో ఆదివారం ధనుర్మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు ఆలయంలో బిందె తీర్థం, ప్రభాత కాలార్చన, సాలగ్రామ అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి వ్యవహరించారు.

నేడు భోజనశాల ప్రారంభం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట స్వర్ణముఖి నది సమీపంలో హిందూ శ్మశానవాటిక వద్ద సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన భోజనశాలను సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్టు హిందూ ధర్మ సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. భోజనశాల నిర్మాణానికి స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులతోపాటు పలువురు దాతలు విరాళం ఇచ్చారని పేర్కొన్నారు.

కండలేరులో 13.118 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 13.118 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయానికి వరద కాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు



వెదురుపట్టులో వరినాట్లు వేస్తున్న కూలీలు



వేణుంబాకంలో వరికి అడుగు మందులు కలుపుతున్న రైతులు

దొరవారిసత్రం : మండలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతోరైతులు వ్యవసాయ పనులను ముమ్మరంగా చేపట్టారు. ఇప్పటికే 3 వేల ఎకరాల్లో ఎలిది పంటలు సాగుచేశారు. 5 వేలు ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నట్టు వ్యవసాయధికారులు తెలిపారు. వెదురుపట్టు, తనియాలి, బూదూరు, తల్లంపాడు, లింగంపాడు, మొదుగుళపాళెం, కమ్మకంద్రిగ, కొత్తకండ్రిగ, పూలతోట, కల్లూరు, శ్రీధనమల్లి, తొగరాముడి తదితర గ్రామాల్లో రైతులు పొలాల్లో బిజీబిజీగా ఉన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



విశ్రాంత ఉద్యోగి మహబూబ్ బాషాను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు



విశ్రాంత ఉపాధ్యాయుడు పద్మనాభం దంపతులకు సత్కారం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డాక్టర్ సీఆర్ రెడ్డి విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ముఖ్యఅతిథులుగా డాక్టర్లు జనార్దన్‌రెడ్డి, బ్రహ్మయ్య పాల్గొని పెన్షనర్ల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు. అదే విధంగా తమకు రావాల్సిన డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం 19 మంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా, సెక్రటరి ఎం.మోహన్, గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, సహ అధ్యక్షులు ఎ.భాస్కరరావు, కోశాధికారి ఎస్.వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు బి.డేవిడ్ జయకుమార్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ బి.శ్రీనివాసులు, కెనరా బ్యాంక్ మేనేజర్ బి.గోపి పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఆకుతోట వీధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులు సంఘం కార్యాలయంలో ఆదివారం అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు పేర్నాటి వెంకటేశ్వర్లు, నాయుడుపేట ఎస్టీవో ఎస్.తేజోవతి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం 80 ఏళ్లు నిండిన సూపర్ సీనియర్, 73 ఏళ్లు నిండిన సీనియర్ విశ్రాంత ఉద్యోగులు 18 మందిని సత్కారించారు. విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పీడీ ఉదయశంకర్, నాగురయ్య, టీచర్ కాలేషా, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం



విరాళం ఇస్తున్న అమరేంద్రయాదవ్

ఓజిలి: మండలంలోని కారూరు గ్రామంలో శ్రీరాములు ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక వైఎస్సార్ సీపీ నేత పాల్చూరు అమరేంద్ర యాదవ్ రూ.1.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయానికి ప్రహరీ గోడ నిర్మించాలని అత్తివరం గ్రామానికి చెందిన అమరేంద్రయాదవ్‌ను గ్రామస్తులు కోరారు. స్పందించిన ఆయన రూ.1.50 లక్షలను వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మడి సుబ్బారావుయాదవ్, పాల్చూరు పెద్ద చెంగయ్య, చిన్న చెంగయ్య, చల్లా శ్రీధర్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. అమరేంద్ర యాదవ్‌ను గ్రామస్తులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మనాభయ్య, మనోహర్, అర్ధమాల రవీంద్రబాబు, నాగయ్య, దశయ్య, రాము, మునీంద్ర, మాధవయ్య పాల్గొన్నారు.

జెడ్చర్ల ఎమ్మెల్యేకు ఘన స్వాగతం



అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

కోట: తెలంగాణ రాష్ట్రం జెడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదివారం కోటకు వచ్చారు. ఆయనకు కోటమ్మ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. నల్లపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డికి అనిరుధ్‌రెడ్డి మేనల్లుడు. ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారి కోటకు వచ్చిన సందర్భంగా నల్లపరెడ్డి అభిమానులు భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. గ్రామదేవత కోటమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కోట బజారువీధిలోని గాంధీ విగ్రహం, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ తనకు రాజకీయాల్లో నల్లపరెడ్డే ఆదర్శమన్నారు. స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్ఫూర్తితో ప్రజలకు మంచి చేసి పేరు తెచ్చుకుంటానని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటికి నిప్పపెట్టిన దుండగులు



కాలిపోయిన ఇంట్లో బాధితురాలు

చిల్లకూరు : మండలంలోని ఉడతావారిపాళెం వడ్డికంద్రిగలో శనివారం అర్ధరాత్రి ఓ ఇంటికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు.. చల్లా భాస్కర్, చెంచమ్మ దంపతులు శనివారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మంటలు తాకిడికి మెలకువ రావడంతో కేకలు పెడుతూ ఇంట్లోని గ్యాస్ సిలిండర్ తీసుకుని వెలుపలికి పరుగు తీశారు. చుట్టుపక్కల వారు మంటలు అదుపు చేసేందుకు విఫలయత్నం చేశారు. దీనిపై బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



మండలంలోని పునబాక గ్రామంలో ఉన్న రచ్చబండ వద్ద సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ క్యారియర్స్ ఏర్పాటు చేయలేదు. చేతికి అందేంత ఎత్తులోనే కనెక్షన్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా మూగ జీవాలతోపాటు ప్రజలు సంచరిస్తుంటారని, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ఫ్యూజ్ క్యారీయర్స్‌కు మరమ్మతులకు గురి కావడంతో తొలగించారని, తర్వాత ఏర్పాటుచేయలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- పెళ్లకూరు